క్లుప్తంగా

7, 8, 9 తరగతుల్లో ప్రవేశానికి దరఖాస్తులు

వెంకటగిరి రూరల్ : పట్టణంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో 7, 8, 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ తులసిజ్యోతి తెలిపారు. ఈ నెల 10 నుంచి 20వ తేదీ వరకు గడువు ఉందని వెల్లడించారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లోగాని, పాఠశాలలో ప్రవేశ రుసుము చెల్లించి నమోదు చేసుకోవాలన్నారు. ఈ నెల 24వ తేదీన ప్రవేశ పరీక్షలు నిర్వహించి 25వ తేదీన ఫలితాలు వెల్లడిస్తామని తెలిపారు. 26 నుంచి అడ్మిషన్లు జరుగుతాయని తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని రెండు గేదెలు మృతి



మృతి చెందిన గేదెలు

కలువాయి(సైదాపురం): కలువాయి మండలంలోని కుల్లూరు జాతీయ రహదారిపై శనివారం గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో రెండు గేదెలు మృతిచెందాయి. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని గేదెల కళేబరాలను పక్కకు తొలగించారు. రోడ్డు దాటుతున్న గేదెలను మితిమీరిన వేగంగా వెళుతున్న వాహనాలు ఢీకొని ఉంటాయని స్థానికులు చెబుతున్నారు.

కారు ఢీకొన్న మరో కారు

కలువాయి(సైదాపురం) : కలువాయి మండలం మాదన్నగారిపల్లి జాతీయ రహదారిపై శనివారం ముందు వెళుతున్న కారును మరో కారు ఢీకొంది. తిరుమల శ్రీవారి దర్శనం చేసుకుని దర్శికి వెళుతున్న కారును తెగచెర్ల నుంచి ఆత్మకూరు వెళుతోంది. మాదన్నగారిపల్లి వేగంగా వచ్చిన మరో కారు ఢీకొంది. రెండు కార్లలో ఎయిర్ బెలూన్లు ఓపెన్ కావడంతో ఎవరికీ గాయాలు కాలేదు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

బెల్టు షాపుపై ఎక్సైజ్ పోలీసుల దాడి

కలువాయి(సైదాపురం) : మండల కేంద్రమైన కలువాయిలోని కనక మహల్ వెళ్లే దారిలో ఉన్న ఒక కూల్ డ్రింక్ షాపులో బెల్టు షాపు నిర్వహిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న నెల్లూరు ఎక్సైజ్ పోలీసులు శనివారం దాడి చేశారు. ఒక మద్యం కేసును స్వాధీనం చేసుకుని షాపు నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్నారు.

ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి నగదు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

దొరవారిసత్రం : ఉచ్చూరు గ్రామానికి చెందిన చిత్తూరు మునీంద్ర అనే యువకుడు గతవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అతని వృద్ధ తల్లిదండ్రులు, మతిస్థిమితం లేని చెల్లెళ్లకు సాయం చేసేందుకు సూళ్లూరుపేట పట్టణ ప్రాంతంకి చెందిన ఆచార్య భరద్వాజ సేవ సంస్థ ముందుకు వచ్చింది. శనివారం రూ.10 వేలు నగదు అందజేసింది.

కిక్కిరిసిన పెంచలకోన



స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రాపూరు: మండలంలోని పెంచలకోన శనివారం భక్తులతో కిక్కిరిసింది. బ్రహ్మోత్సవాల అనంతరం వచ్చే నాలుగో శనివారం కావడంతో రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి, ఆదిలక్ష్మీదేవి, అంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఉదయం 10 గంటలకు స్వామి అమ్మవార్లకు శాస్త్రోక్తంగా కల్యాణం చేశారు. రాత్రి 7 గంటలకు ఊంజల్ సేవ నిర్వహించారు.

ఘనంగా జాతీయ తెలుగు సాయిభక్త సమ్మేళనం



వలంటీర్లను సత్కరిస్తున్న చైర్మన్ నరసింహారావు

వాకాడు : మండల కేంద్రమైన వాకాడులోని ఆనంద సాయి నిలయం వద్ద శనివారం శనివారం జాతీయ స్థాయిలో తెలుగు సాయిభక్త సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ శిరిడి సాయి భక్త సేవా ట్రస్టు చైర్మన్ ఎస్ఎల్ నరసింహారావు, పలువురు ట్రస్ట్ సభ్యులు బాబా సత్సంగం, మహిమలు, అనుభవాలను తెలిపారు. భారతదేశం నలుమూలల నుంచి వచ్చిన సాయి ఉపన్యాస సద్గురువులు బాబా బోధించిన వాక్యాలు, వాటి అర్థాలను వివరించారు. మధ్యాహ్నం 2 వేల మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ ఎస్ లక్ష్మీ, తిరుపతి జిల్లా కన్వీనర్ కె విజయలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

● ప్రమాదకరంగా చెట్లు



సైదాపురం: మండల కేంద్రమైన సైదాపురంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఉన్న చెట్లు ఎండిపోయి ప్రమాదకరంగా మారాయి. కూలిపోయేందుకు సిద్ధంగా ఉండడంతో కార్యాలయానికి వచ్చే ప్రజలు భయాందోళన చెందుతున్నారు. వాటిని తొలగించాలని పలుమార్లు అధికారులను కోరుతున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

● ప్రయాణం నరక ప్రాయం





సైదాపురం: మండలంలోని సైదాపురం–గూడూరు రోడ్డు అధ్వానంగా ఉంది. తారు లేచిపోయి కంకర తేలడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు 13 కిలోమీటర్లు ఉంది. మూడు నెలల క్రితం అక్కడక్కడా ప్యాచ్ వర్కులు చేశారు. అది కూడా లేచిపోయి పెద్ద పెద్ద గుంతలు పడ్డాయి. రెండు జిల్లాలకు కలిపే ప్రధాన రహదారి కావడంతో వాహనాల తాకిడి ఎక్కువగా ఉంటుంది. వాహనాలు గుంతల్లో పడి మరమ్మతులకు గురవుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. అధికారులు రోడ్డును బాగు చేయాలని కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలు



గూడూరు ఈద్గాలో దైవ సందేశం ఇస్తున్న ముస్లింల మత గురువు, పాల్గొన్న ముస్లింలు



నాయుడుపేటలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



రాపూరులో ఈద్గాకు వెళుతున్న ముస్లింలు

సైదాపురం/దొరవారిసత్రం/రాపూరు/ఓజిలి/చిల్లకూరు/వెంకటగిరి రూరల్/నాయుడుపేట టౌన్/సూళ్లూరుపేట రూరల్/చిట్టమూరు : వెంకటగిరి, సూళ్లూరుపేట, గూడూరు నియోజకవర్గాల్లోని ముస్లింలు శనివారం బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఉదయమే మసీదులకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పేదలకు దానధర్మాలు చేశారు. కొన్నిచోట్ల అన్నదానం చేశారు.

● సైదాపురం మండలంలోని సైదాపురం, ఊటుకూరు, కలిచేడు, గిద్దలూరు, చాగనం, మర్లపూడి గ్రామాల్లో శనివారం ముస్లింలు బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పేదలకు దానం చేశారు.

● దొరవారిసత్రం మండలం వేణుంబాకం, గొల్లపాళెం, డీవీ సత్రం, కల్లూరు తదితర గ్రామాల్లోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వేణుంబాకంలో పలువురు ముస్లింలు పేదలకు అన్నదానం చేశారు.

● రాపూరు మండలంలో బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. రాపూరులోని పెద్ద మసీదు నుంచి ర్యాలీగా ఈద్గా చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

● ఓజిలి మండలంలోని కురుగొండ, ఓజిలి, రాచపాళెం, భట్లకనుపూరు, నెమళ్లపూడి తదితర గ్రామాల్లోని మసీదుల్లో బక్రీద్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పలువురు వృద్ధులు, పేదలకు పండ్లు, స్వీట్లు పంచిపెట్టారు.

● గూడూరు పట్టణంలోని ముస్లింలు బక్రీద్‌ను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయమే మసీదులకు చేరుకుని ప్రార్థనలు చేశారు. అనంతరం ర్యాలీగా ఈద్గాలకు చేరుకున్నారు. అక్కడ మత పెద్దలు దైవ సందేశం వినిపించారు.



ఓజిలిలో..

● చిల్లకూరు మండలంలోని చిల్లకూరు, నాంచారమ్మపేట, పారిచెర్లవారిపాళెం, తొణుకుమాల, ఉడతావారిపాళెం, చింతవరం, ఏరూరు, మోమిడి, వరగలి, గుమ్మళ్ళదిబ్బ గ్రామాల్లో ముస్లింలు బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.

● వెంకటగిరి పట్టణంలోని ముస్లింలు బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ముస్లిం మత పెద్దలు దైవ సందేశాన్ని వినిపించారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



చిట్టమూరులో..

● నాయుడుపేట పట్టణంలోని జామియా మసీదు సమీపంలోని షాదీ మంజిల్ ఈద్గా వద్ద ముస్లింలు ఈదుల్ జుహా ప్రత్యేక నమాజు చేశారు. మౌలానా అబూబకర్ దైవ సందేశాన్ని వినిపించారు. పేదలకు దానం చేయాలని సూచించారు. ఖుర్బాని ప్రాముఖ్యతను వివరించారు. అదేవిధంగా పెద్ద దర్గా ఆవరణలోవున్న అమీర్‌షావలి మసీదు, పాత బస్టాండు సమీపంలోని నూర్ మసీదు, అమరాగార్డెన్ వద్ద ఉన్న మక్కా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

● సూళ్లూరుపేట మండలంలోని ముస్లింలు బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. మన్నారు పోలూరులోని ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఇమామ్ షబ్బీర్ అహ్మద్ బక్రీద్ పండుగ విశిష్టతను వివరించారు.

● చిట్టమూరు మండలంలోని మల్లాం, కోగిలి, చిట్టమూరు, తాడిమేడు, ఉప్పలమర్తి గ్రామాల్లో ఉన్న మసీదుల్లో ముస్లిం మత పెద్దలు, ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పేదలకు సాయం చేయడమే బక్రీద్ పండుగ ప్రధాన ఉద్దేశమని మత గురువులు తెలిపారు.

హాస్టల్ మరమ్మతులకు రూ.19 లక్షలు

కోట: చిట్టేడులోని సాంఘిక సంక్షేమశాఖ బాలుర వసతి గృహంలో మరమ్మతుల కోసం రూ.19 లక్షల సీఎస్ఆర్ నిధులు మంజూరైనట్లు వార్డెన్ రవి తెలిపారు. ఈ హాస్టల్‌లో వంద మంది వరకు విద్యార్థులు వున్నారు. వారికి తగిన వసతులు లేవు. ఈ క్రమంలో హాస్టల్‌ను విజిట్ చేసిన ఉన్నతాధికారులు సీఎస్ఆర్ నిధులు మంజూరు చేశారు. ఆ నిధులతో ప్రహరీ నిర్మాణం, ఓవర్ హెడ్ ట్యాంక్, నీటి వసతి కల్పించనున్నట్టు తెలిపారు.

ఎస్‌బీఐలో రక్తదాన శిబిరం



రక్త దాన శిబిరంలో పాల్గొన్న ఎస్‌బీఐ ఉద్యోగులు

చిల్లకూరు : గూడూరు పట్టణంలోని స్టేట్ బ్యాంకు ప్రధాన శాఖ కార్యాలయంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆలిండియా స్టేట్ బ్యాంకు స్టాఫ్ ఫెడరేషన్ నాయకులు మాట్లాడుతూ యూనియన్ అభ్యున్నతికి కృషి చేసిన కామ్రేడ్ తారక్‌నాథ్ వర్ధంతిని పురస్కరించుకుని ఎస్‌బీఐ అమరావతి సర్కిల్‌లో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సుమారు 50 మంది ఉద్యోగులు రక్త దానం చేశారు. కామ్రేడ్ విరూపాక్షరాజు, విజయకుమార్, మూర్తి, బాబూరావు, రామచంద్రయ్య పాల్గొన్నారు.

పాఠశాలలకు స్పోర్ట్స్ కిట్ల పంపిణీ



క్రీడా సామగ్రిని అందజేస్తున్న రాజేంద్ర ప్రసాద్

చిల్లకూరు : గూడూరు నియోజకవర్గంలోని గూడూరు, చిల్లకూరు, వాకాడు మండలాల్లోని పలు పాఠశాలలకు శనివారం ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ సహకారంతో స్పోర్ట్స్ కిట్లను ఎంఈవోలకు అందజేశారు. గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక అధ్యక్షుడు వేగూరు రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడలపై ఆసక్తిని పెంపొందించేందుకు క్రీడా సామగ్రి అవసరమన్నారు. ఈ క్రమంలోనే గూడూరు, చిల్లకూరు, వాకాడు మండలాల్లోని పలు పాఠశాలలను ఎంపిక చేసి క్రీడా సామగ్రి అందజేసినట్టు తెలిపారు. స్టేడియంలో క్రీడాకారులకు ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో చిల్లకూరు ఎంఈవో–2 రవూఫ్, పీడీలు కోటేశ్వరయ్య, శ్రీనివాసులు, పి.వెంకటరమణ, చంద్ర, చిన్న శివయ్య తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



ఏసీ శ్రీనివాసులురెడ్డికి చెక్కు ఇస్తున్న దాతలు

రాపూరు : పెంచలకోనలో పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి కలువాయి మండలం తోపుగుంట అగ్రహారానికి చెందిన రవీంద్రబాబు భార్య శ్రీవేణి కుటుంబ సభ్యులు రూ.1,01,116లు విరాళం ఇచ్చారు. వారికి ఆలయ ఏసీ శ్రీనివాసులు రెడ్డి మూడు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు సరుకులు అందజేత



సరుకులు అందజేస్తున్న ప్రగతి సంస్థ ప్రతినిధులు, వైద్యులు

చిల్లకూరు : ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల్లో జీవన ప్రమాణాలు పెంపొందించేందుకు గూడూరుకు చెందిన ప్రముఖ వైద్యులు జనార్దనరెడ్డి, రోహిణి ప్రతినెలా డాక్టర్ సీఆర్ రెడ్డి జ్ఞాపకార్థం ఆరోగ్య సంజీవని పథకం కింద పౌష్టికాహారం అందిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం గూడూరు ఏరియా ఆస్పత్రి ఆవరణలో పలువురు ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు సరుకులు పంపిణీ చేశారు. ప్రగతి సేవా సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులను ఆదుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైద్యులు హరీష్‌రెడ్డి, సంస్థ ప్రతినిధులు శ్రీనివాసులు, రాధయ్య, ప్రభాకర్, పురందరరాజు, వెంకటేశ్వరరావు, పిల్లెళ్ల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని వినతి



ఎంపీడీవో వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేస్తున్న బొల్లవారిపాళెం కాలనీ వాసులు

బాలాయపల్లి(సైదాపురం) : బాలాయపల్లి మండలం బొల్లవారిపాళెంలో మూడు నెలల నుంచి తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోయారు. వారు శనివారం ఎంపీడీవో వెంకటేశ్వర్లుకు వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ తమ కాలనీలో సుమారు 3 నెలల నుంచి తాగునీటి కోసం అల్లాడుతున్నట్లు తెలిపారు. చిలుము నీరు తాగాల్సిన వస్తోందని వాపోయారు. సమస్యను పరిష్కరించాలని పలుమార్లు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా



విద్యుత్ సబ్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న టెక్నికల్ డైరెక్టర్ గురవయ్య

చిల్లకూరు : వినియోగదారులకు ఇబ్బంది లేకుండా మెరుగైన విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఏపీ ఎస్‌పీడీసీఎల్ టెక్నికల్ డైరెక్టర్ గురవయ్య తెలిపారు. ఆయన శనివారం గూడూరు ఒకటో పట్టణంలోని డీఎస్ఆర్ కమ్యూనిటీ హాల్ వద్ద ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తి చేయడానికి సిద్ధంగా ఉందన్నారు. వినియోగదారులు సోలార్ ప్యానళ్ల ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. బిల్లులు, బకాయిల వసూలుపై చొరవ చూపాలన్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి రైతుకూ వ్యవసాయ కనెక్షన్లు ఇవ్వాలని పేర్కొన్నారు. గూడూరు, వాకాడు, కోట, మండలాల్లో పెండింగులో ఉన్న విద్యుత్ కనెక్షన్లను తరితగతిన అందజేయాలని ఆదేశించారు. విద్యుత్ చౌర్యం విషయంలో కఠినంగా వ్యవహరించాలని, ట్రాన్స్‌ఫార్మర్లు ఎందుకు కాలిపోతున్నాయనే విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. గూడూరు పట్టణ శివారులోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాల వద్ద ఉన్న సబ్ స్టేషన్ నుంచి టౌన్ హాల్ వద్ద ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్ వరకు 33 కేవీ విద్యుత్ లైన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఆయన వెంట గూడూరు విద్యుత్ శాఖ ఈఈ నరేంద్రరెడ్డి, డీఈఈ ప్రసాద్, ఏఈ ఏడకొండలు ఉన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీలో గురుకుల విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చాటిన శ్రీవేమ విద్యార్థులతో కరస్పాండెంట్ శ్రీనివాసులు రెడ్డి

నాయుడుపేట టౌన్ : ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్టు ప్రిన్సిపాళ్లు తెలిపారు. నాయుడుపేట పట్టణంలోని అంబేడ్కర్ బాలుర గురుకులంలో సీనియర్ ఇంటర్ విద్యార్థులు 27 మంది ఉత్తీర్ణులైనట్టు తెలిపారు. అదే విధంగా జూనియర్ ఇంటర్‌లో 32 మందికి గాను 31 మంది ఉత్తీర్ణులై 87 శాతం వచ్చినట్లు ప్రిన్సిపాల్ దాదాపీర్ వెల్లడించారు. గత ఏడాది కంటే ఈ సారి ఉత్తీర్ణత పెరిగిందన్నారు. పుదూరు బాలికల గురుకులంలో సీనియర్ ఇంటర్‌లో 100 శాతం, జూనియర్ ఇంటర్‌లో 100 శాతం ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపాల్ రూత్ రమోలా తెలిపారు.

మంచి ఫలితాలు సాధించిన శ్రీవేమ విద్యార్థులు

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో శ్రీవేమ జూనియర్ కళాశాల విద్యార్థులు మంచి ఫలితాలు సాధించినట్టు కరస్పాండెంట్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఆయన శనివారం విద్యార్థులను అభినందించారు.

వెబ్ కౌన్సిలింగ్ రద్దు చేయాలని నిరసన



నిరసన తెలుపుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

చిల్లకూరు : ఉపాధ్యాయుల బదిలీల్లో వెబ్ కౌన్సిలింగ్‌ను రద్దు చేయాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. వారు శనివారం గూడూరు పట్టణంలోని ఎమ్మార్సీ వద్ద నిరసన తెలిపారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరంజీవి మాట్లాడుతూ ఉపాధ్యాయులతో జరిపిన చర్చల్లో ఎస్‌జీటీలకు మ్యాన్యువల్ కౌన్సిలింగ్ చేపడతామని హామీ ఇచ్చి ప్రక్రియను మొదలుపెట్టారని తెలిపారు. ఇప్పుడు వెబ్ ఆప్షన్లు ఎంపిక చేసుకోవాలని చెప్పడం దారుణమన్నారు. వెబ్ ఆప్షన్లను ఎత్తి వేయాలని, లేనిపక్షంలో సోమవారం ప్రతి జిల్లాలో విద్యాశాఖ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం ఎంఈవోలకు వినతి పత్రం అందజేశారు.

దక్కిలి: సెకండరీ గ్రేడ్ టీచర్లకు మ్యాన్యువల్‌గా కౌన్సిలింగ్ నిర్వహించాలని మహాజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర ప్రధానకార్యదర్శి చేమూరు మస్తాన్, దూడల పెంచలయ్య డిమాండ్ చేశారు. వారు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఘనంగా ఆలయ కుంభాభిషేకం

● స్వామిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి



స్వామి వారిని దర్శించుకుంటున్న కిలివేటి సంజీవయ్య, నాయకులు

ఓజిలి: మండలంలోని రావిపాడు పంచాయతీ లింగారెడ్డిపల్లిలో నిర్మించిన వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ, మహా కుంభాభిషేకం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా వేద పండితులు ఉదయం యంత్రస్థాపన చేసి మంత్రోచ్చరణల మధ్య విగ్రహ ప్రతిష్ఠ చేశారు. మహా కుంభాభిషేకం, మహాపూర్ణాహుతి, మూలమంత్రం, సర్వదేవతల హోమం చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి స్వామివారి ఉత్సవమూర్తులకు శాంతి కల్యాణం చేశారు. రూ.50 లక్షలతో ఆలయాన్ని నిర్మించినట్టు చప్పిడి నాగభూషణరెడ్డి తెలిపారు. స్వామి వారిని మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ పండితులు స్వాగతం పలికి శాలువాలతో సన్మానించారు. మండల కన్వీనర్ హరనాథ్‌రెడ్డి, ఏఎంసీ మాజీ డైరెక్టర్ చప్పిటి దీప్తి, వెంకటరెడ్డి, నాగభూషణరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ఖాదర్‌బాషా, మధుసూదన్‌రెడ్డి, సర్పంచ్ సురేష్‌రెడ్డి, ఎం.ప్రసాద్, వేణురెడ్డి, కుమార్‌నాయుడు, పరంగి ప్రసాద్, చిన్న ముమ్మయ్య, కృష్ణ, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని ముగ్గురు మహిళలకు గాయాలు



ప్రమాదంలో గాయపడిన మహిళా కూలీలు

వెంకటగిరి (సైదాపురం): వెంకటగిరి పట్టణం రాపూరు రోడ్డులో శనివారం కారు ఢీకొనడంతో ముగ్గురు మహిళలు గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. వెంకటగిరి బొప్పాపురానికి చెందిన భవన నిర్మాణ కూలీలు డక్కిలి మండలం మోపూరులో పనులకు వెళ్లారు. సాయంత్రం ఇంటికి బయలుదేరారు. రాపూరు రోడ్డు మలుపు వద్ద మిల్లర్‌ను కారు ఢీకొంది. మిల్లర్ ముందు కూర్చున్న ముగ్గురు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని వెంకటగిరిలోని వైద్యశాలకు తరలించారు.

సూళ్లూరుపేట కమిషనర్‌పై కేసు

చిత్తూరు అర్బన్: సూళ్లూరుపేట మున్సిపల్ కమిషనర్ కే.చిన్నయ్యపై చిత్తూరు పోలీసులు శనివారం క్రిమినల్ కేసు నమోదు చేశారు. సీఐ మహేశ్వర కథనం మేరకు... చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో చిన్నయ్య కారుణ్య నియామకం కింద ఉద్యోగం పొందాడు. ఆయన ఇచ్చిన సర్టిఫికెట్లు తప్పుడువని, హెల్త్ అసిస్టెంట్, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందడానికి ఇచ్చిన సర్టిఫికెట్లు కూడా తప్పుడువని ప్రస్తుత మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో చిన్నయ్యపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. కాగా చిన్నయ్య చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ నుంచి డిప్యూటేషన్‌పై సూళ్లూరుపేట మున్సిపల్ కమిషనర్ నియమితులై పనిచేస్తున్నారు.

ఇంటర్ రీ వ్యాల్యేషన్‌లో పెరిగిన మార్కులు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కలువాయి (సైదాపురం) : జూనియర్ ఇంటర్ రీ వ్యాల్యేషన్‌లో తమ విద్యార్థుల మార్కులు పెరిగినట్టు కలువాయి మండలం బీఈఎస్ ఆర్ జెడ్పీ బాలికల హైస్కూల్ ప్లస్ హెచ్ఎం అబ్బాస్ ఆలి తెలిపారు. ఎంపీసీలో తాళ్లూరి కావ్యకు 456 మార్కులు, కలసాలి మౌనిక 456, పల్లాల ఉషారాణికి 440, బైపీసీలో దీపాల పూజితకు 421 మార్కులు వచ్చినట్టు పేర్కొన్నారు. వారిని ఉపాధ్యాయులు ప్రసాద్, కృష్ణయ్య, రాంబాబు అభినందించారు.

హంస వాహనంపై శ్రీవారి విహారం

చిల్లకూరు : గూడూరు పట్టణం రాజవీధిలో వెలసిన ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో బాగంగా శనివారం స్వామి వారు హంస వాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు.